## ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

- అప్రమత్తతో సైబర్ నేరాల బారిన పడకుండా అడ్డుకోగలం
- ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్స్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్స్, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటి నూతన పద్ధతులలో మోసం చేస్తున్న సైబర్ క్రైమ్ నేరగాళ్లు
- మోసపోయామని గ్రహించిన వెంటనే జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930 కి సంప్రదించాలి.





జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం



## మహబూబ్‌నగర్

నాగర్ కర్నూల్, వనపర్తి
జోగులాంబ గద్వాల
నారాయణపేట





ఆదివారం, జూలై 5, 2026 పేజీలు : 6


# మిడ్జిల్ నాటిన మొక్కే..
# నేడు రాష్ట్రాన్ని నడిపిస్తున్న వృక్షం!



**- "మిడ్జిల్‌కు నా ప్రాణం ఇచ్చినా తక్కువే".. -భావోద్వేగానికి లోనైన సీఎం రేవంత్ రెడ్డి**

మిడ్జిల్, జూలై 4 (ప్రజా జ్యోతి ): రాజకీయంగా తనను అక్కున చేర్చుకుని, నాయకుడిగా తీర్చిదిద్దిన మిడ్జిల్ మండల ప్రజలకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగంగా కృతజ్ఞతలు తెలిపారు. 2006 జూలై 4న జడ్పీటీసీగా తనను ఆశీర్వదించిన మిడ్జిల్ ప్రజలు నాటిన చిన్న మొక్కే. నేడు రాష్ట్రాన్ని నడిపించే పెద్ద వృక్షంగా ఎదిగిందని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానానికి పునాది వేసిన మిడ్జిల్‌కు తన ప్రాణం ఇచ్చినా ఆ రుణం తీరదని వ్యాఖ్యానించారు. మిడ్జిల్ మండల కేంద్రంలో జిల్లా మాజీ చైర్మన్ స్వర్గీయ ధ్యాప గోపాల్‌రెడ్డి విగ్రహావిష్కరణ, డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ విగ్రహావిష్కరణ అనంతరం నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి



## సీఎం పర్యటనకు పకడ్బందీ
# భద్రతా ఏర్పాట్లు

- ఎస్పీ డి. జానకి
- పోలీసుల సమన్వయంతో విజయవంతంగా ముగిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మిడ్జిల్ పర్యటన



## రైతు భూమి అక్రమ నమోదు వ్యవహారంలో
# కలెక్టర్ కఠిన చర్యలు

- జీవించి ఉన్న రైతును మృతుడిగా చూపించి పట్టా భూమిని అసైన్డ్ భూమిగా నమోదు
- భూభారతి ఆపరేటర్ మూడావత్ జైపాల్ తొలగింపు క్రిమినల్ కేసు నమోదు
- డిప్యూటీ తహసీల్దార్ ఏ అశోక్ కుమార్ సస్పెన్షన్
- విచారణలో తీవ్ర నిర్లక్ష్యం, నిబంధనల ఉల్లంఘన వెలుగులోకి



# మిడ్జిల్ నాటిన మొక్కే.. నేడు రాష్ట్రాన్ని నడిపిస్తున్న వృక్షం!




ప్రసంగించారు. తన రాజకీయ జీవితంలో ప్రతి మెట్టుకు మిడ్జిల్ ప్రజల ఆశీర్వాదమే బలమని, జడ్పీటీసీ నుంచి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, ఎంపీ, టీపీసీసీ అధ్యక్షుడు, చివరకు ముఖ్యమంత్రి స్థాయికి చేరుకోవడంలో ప్రజల విశ్వాసమే కారణమని చెప్పారు.మిడ్జిల్‌ను రాష్ట్రంలోనే ఆదర్శ మండలంగా తీర్చిదిద్దే బాధ్యత తనదేనని స్పష్టం చేసిన సీఎం, ఈ మండలాన్ని ప్రత్యేకంగా దత్తత తీసుకుని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను సమన్వయం చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కను ఆదేశించినట్లు వెల్లడించారు. ఒకప్పుడు “డార్క్ ఏరియా”గా పేరొందిన మిడ్జిల్.. ఇప్పుడు అభివృద్ధికి చిరునామాగా మారాలని ఆకాంక్షించారు.

మండలంలోని ప్రతి గ్రామానికి రూ.50 లక్షల చొప్పున మొత్తం రూ.20 కోట్ల నిధులను అభివృద్ధి పనుల కోసం మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. రోడ్లు, తాగునీరు, మౌలిక వసతులు, గ్రామాభివృద్ధి కార్యక్రమాలకు ఈ నిధులు వినియోగించనున్నట్లు తెలిపారు.

స్వర్గీయ ధ్యాప గోపాల్‌రెడ్డి సేవలను గుర్తు చేసుకుంటూ, తన రాజకీయ ఎదుగుదలకు ఆయన కీలకంగా నిలిచారని కొనియాడారు. మాజీ కేంద్ర మంత్రి జైపాల్‌రెడ్డికి కూడా మార్గనిర్దేశనం చేసిన గొప్ప నాయకుడు ధ్యాప గోపాల్‌రెడ్డి అని ప్రశంసించారు. తనపై అనుభవం లేదని విమర్శించిన వారిని ఉద్దేశించి సీఎం స్పందిస్తూ, తాను గ్రామీణ జీవితంలో పెరిగానని, రైతు కష్టాలు, పేదల బాధలు, అన్ని వర్గాల సమస్యలు తెలిసిన వ్యక్తినని చెప్పారు.

పాలమూరు బిడ్డలు కేవలం కూలి పనికే కాదు.. రాష్ట్రాన్ని సమర్థంగా పాలించే సామర్థ్యం కూడా ఉందని స్పష్టం చేశారు.

గత ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేసిన సీఎం, ప్రాజెక్టుల పేరుతో వేల కోట్ల రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. గత పదేళ్లలో అభివృద్ధి కంటే అవినీతే ఎక్కువ జరిగిందని, ప్రజలు అలాంటి పాలనను తిరస్కరించారని అన్నారు.ఎస్సీ వర్గీకరణ అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ముందడుగు వేసిందని, గ్రామాలు అభివృద్ధి చెందితేనే రాష్ట్రం, దేశం అభివృద్ధి చెందుతాయని పేర్కొన్నారు. యువత ప్రజాపాలనపై చైతన్యవంతంగా ఉండాలని, రాష్ట్ర భవిష్యత్తు కోసం బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.ప్రతిపక్షాలపై విమర్శలు చేస్తూ, ప్రజల సంపదను దోచుకునే శక్తులకు మళ్లీ అవకాశం ఇవ్వొద్దని రాష్ట్ర ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మిడ్జిల్ ప్రజలు తనకు చూపిన ప్రేమ, విశ్వాసాన్ని జీవితాంతం మరువనని, వారి రుణం తీర్చుకునేందుకు నిరంతరం కృషి చేస్తానని సీఎం రేవంత్ రెడ్డి భావోద్వేగంగా పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు, వాకిటి శ్రీహరి, నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు అనిరుద్ రెడ్డి, కసిరెడ్డి నారాయణ రెడ్డి, రాజేష్ రెడ్డి, నవీన్ యాదవ్, మధుసూదన్ రెడ్డి, పలువురు కార్పొరేషన్ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, ప్రజాప్రతినిధులు, అధికారులు, భారీ సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

## రైతు భూమి అక్రమ నమోదు వ్యవహారంలో కలెక్టర్ కఠిన చర్యలు

నాగర్ కర్నూల్ జిల్లా జూలై 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలంలోని హాజీపూర్ గ్రామానికి చెందిన రైతు జంచుక మసన్న జీవించి ఉండగానే ఆయన మరణించినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి, రైతుకు తెలియకుండానే ఆయన పట్టాదారు భూమిని ప్రభుత్వ అసైన్డ్ భూమిగా రెవెన్యూ రికార్డుల్లో నమోదు చేసిన ఘటనపై జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ సీరియస్‌గా స్పందించారు. బాధిత రైతు ఫిర్యాదు మేరకు పూర్తి స్థాయి విచారణ చేపట్టించిన కలెక్టర్, విచారణలో వెలుగులోకి వచ్చిన వాస్తవాల ఆధారంగా బాధ్యులపై కఠిన శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

విచారణలో అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో భూభారతి ఆపరేటర్‌గా పనిచేస్తున్న మూడవత్ జైపాల్ విధి నిర్వహణలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శించినట్లు తేలడంతో ఆయనను వెంటనే విధుల నుంచి తొలగించారు.

అతనిపై క్రిమినల్ కేసు నమోదు చేశారు. అదే సమయంలో ఘటన జరిగిన సమయంలో అచ్చంపేట తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్‌గా విధులు నిర్వహించి, ప్రస్తుతం పెద్దకొత్తపల్లి తహసీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహసీల్దార్ (డిప్యుటేషన్)గా పనిచేస్తున్న ఎ. అశోక్ కుమార్ పై కూడా విచారణలో తీవ్ర నిర్లక్ష్యం నిర్ధారణ కావడంతో ఆయనను విధుల నుంచి సస్పెండ్ చేస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు.

జిల్లా కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వుల ప్రకారం, తెలంగాణ భూ–భారతి (రికార్డ్ ఆఫ్ రైట్స్ ఇన్ ల్యాండ్) రూల్స్--2025 ప్రకారం వారసత్వ మార్పిడి కేసుల్లో దరఖాస్తుదారులు సమర్పించిన పత్రాలను పూర్తిస్థాయిలో పరిశీలించి, రిజిస్ట్రేషన్ చట్టం--1908 మరియు భూ–భారతి నిబంధనల ప్రకారం ధ్రువీకరించాల్సిన బాధ్యత సంబంధిత అధికారిపై ఉంది. అయితే ఎ. అశోక్ కుమార్ సమర్పించిన పత్రాలను సమగ్రంగా పరిశీలించకుండా, తగిన ధ్రువీకరణ లేకుండానే వారసత్వ మార్పిడి ప్రక్రియను పూర్తి చేయడం ద్వారా నిబంధనలను ఉల్లంఘించినట్లు విచారణలో తేలిందని కలెక్టర్ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నిర్లక్ష్యం కారణంగానే జీవించి ఉన్న రైతును మృతుడిగా చూపిస్తూ రికార్డుల్లో మార్పులు జరిగాయని, ఫలితంగా రైతు పట్టాదారు భూమి ప్రభుత్వ అసైన్డ్ భూమిగా నమోదై రైతు హక్కులకు తీవ్ర భంగం కలిగిందని విచారణలో వెల్లడైంది. ఈ నేపథ్యంలో తెలంగాణ సివిల్ సర్వీసెస్ (వర్గీకరణ, నియంత్రణ మరియు అప్పీల్) నిబంధనలు--1991లోని రూల్–-8 ప్రకారం ఎ. అశోక్ కుమార్‌ను తక్షణమే సస్పెండ్ చేస్తున్నట్లు కలెక్టర్ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. శాఖాపరమైన విచారణ పూర్తయ్యే వరకు లేదా తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకు సస్పెన్షన్ అమల్లో ఉంటుందని కలెక్టర్ ఉత్తరంలో తెలిపారు. సస్పెన్షన్ కాలంలో ఆయనకు నిబంధనల ప్రకారం ప్రాథమిక వేతనం, అలవెన్సులలో 50 శాతం జీవనభృతి చెల్లించనున్నట్లు ఉత్తర్వుల్లో వెల్లడించారు.

అలాగే విచారణ పూర్తయ్యే వరకు నాగర్‌కర్నూల్ జిల్లానే ఆయన ప్రధాన కేంద్రంగా ఉంటుందని, జిల్లా కలెక్టర్ అనుమతి లేకుండా ప్రధాన కేంద్రాన్ని విడిచి వెళ్లరాదని ఆదేశించారు.

ప్రతి నెలా ఇతర ఉద్యోగం చేయడం లేదని ధ్రువీకరణ పత్రాన్ని జిల్లా ట్రెజరీ అధికారికి సమర్పించాలని కూడా ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

రైతుల భూ హక్కులకు భంగం కలిగించే విధంగా వ్యవహరించే అధికారులు, సిబ్బందిపై ఎలాంటి రాజీ ఉండదని జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ స్పష్టం చేశారు. రెవెన్యూ రికార్డుల నిర్వహణలో పారదర్శకత, బాధ్యత, నిబంధనల అమలు తప్పనిసరి అని, నిర్లక్ష్యం లేదా అక్రమాలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు కొనసాగుతాయని హెచ్చరించారు.

## సీఎం పర్యటనకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు

మహబూబ్‌నగర్, జులై 4 (ప్రజాజ్యోతి బ్యూరో): మహబూబ్‌నగర్ జిల్లా మిడ్జిల్ గ్రామంలో శనివారం జరిగిన ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా జిల్లా పోలీసు శాఖ విస్తృత స్థాయిలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టింది. ప్రజల భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల పార్కింగ్, సభా ప్రాంగణ భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించి బందోబస్తు నిర్వహించారు.

మల్టీ జోన్–2 ఐజీ షానవాజ్ ఖాసీం, జోన్–7 డీఐజీ ఎల్.ఎస్. చౌహాన్ స్వయంగా పర్యటన ప్రాంతాలను సందర్శించి భద్రతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలించారు. హెలిప్యాడ్, సభా ప్రాంగణం, వీఐపీ మార్గాలు, వాహనాల పార్కింగ్ ప్రాంతాలు, బస్సుల రాకపోక మార్గాలు, ప్రజల రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో అమలు చేస్తున్న భద్రతా చర్యలను పరిశీలించి జిల్లా ఎస్పీ దరావాత్ జానకితో సమీక్ష నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు. విధుల్లో ఉన్న పోలీసు అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని ఆదేశించిన అధికారులు, ప్రతి కీలక ప్రాంతంలో తగిన సంఖ్యలో పోలీసు బలగాలను మోహరించి ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యలు చేపట్టారు.

ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికను అమలు చేయడంతో పాటు, వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక స్థలాలను ఏర్పాటు చేసి ప్రజలకు అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకున్నారు. సభా ప్రాంగణ పరిసరాల్లో నిరంతర నిఘా కొనసాగిస్తూ అన్ని భద్రతా ప్రమాణాలను అమలు చేశారు.జిల్లా పోలీసు శాఖ ఇతర ప్రభుత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటూ అన్ని ఏర్పాట్లను సమర్థవంతంగా నిర్వహించడంతో ముఖ్యమంత్రి పర్యటన ప్రశాంత వాతావరణంలో విజయవంతంగా ముగిసింది.ఈ బందోబస్తులో నాగర్‌కర్నూల్ ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి. పాటిల్, గద్వాల ఎస్పీ శ్రీనివాసరావు, వికారాబాద్ అదనపు ఎస్పీ రాజేష్ మీనా, మహబూబ్‌నగర్ అదనపు ఎస్పీ (ఎన్‌బీ) రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు తదితర అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీకే ఫైల్స్, తెలియని వెబ్సైట్లతో జాగ్రత్తగా ఉండాలి

### జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ .

నారాయణపేట ప్రతినిధి జూలై 04 (ప్రజా జ్యోతి)

ప్రస్తుత సమాజంలో సైబర్ నేరగాళ్లు నూతన పద్ధతులను ఉపయోగించి ప్రజలను మోసగిస్తున్న సందర్భంలో

నారాయణపేట జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ప్రజలందరికీ అవగాహన, అప్రమత్తతతోనే సైబర్ నేరాలను అడ్డుకోగలమని ఒక ప్రకటన తెలియజేశారు. ప్రస్తుతం సమాజంలో ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు, స్టాక్ మార్కెటింగ్ అంటూ లాభాలు చూపిస్తామంటూ ప్రైవేటు వ్యక్తులు చేస్తున్న మోసాలు సామాన్య ప్రజలకు తెలియాలని అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. అదేవిధంగా వాట్సాప్ నందు టెలిగ్రామ్ నందు సోషల్ మీడియాలలో ఏపీకే ఫైల్స్ రావడం వాటి ద్వారా మొబైల్ కంట్రోల్ సైబర్ నేరగాళ్ల చేతుల్లోకి వెళ్లడం లాంటి సంభవిస్తుందని వాటిని అడ్డుకోవడానికి అప్రమత్తత ప్రధానాస్త్రంగా ఉంటుందని తెలిపారు. ఒకవేళ మోసగాళ్ల చేత మోసపోయినట్లయితే వెంటనే (గోల్డెన్ హవర్) లో జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్ లైన్ నెంబర్ 1930కి లేదా సైబర్ క్రైమ్ వెబ్సైట్ నందు ఫిర్యాదు చేయడం మొదటి కర్తవ్యం గా వ్యవహరిస్తుందని తెలిపారు. ముఖ్యంగా సైబర్ క్రైమ్ నేరస్తులు వినియోగిస్తున్న నూతన పద్ధతులు ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్, లోన్ ఫ్రాడ్, యూపీఐ ఫ్రాడ్, ఏపీకే ఫైల్స్, నకిలీ వెబ్సైట్లు, స్టాక్ మార్కెట్ ఫ్రాడ్ లాంటిది జరుగుతున్న నేపథ్యంలో ప్రజలందరూ ముఖ్యంగా యువత మాయమాటలకు నమ్మి మోసపోకుండా ఉండాలని తెలిపారు. సైబర్ క్రైమ్ నేరగాళ్లు వినియోగిస్తున్న పద్ధతిని తెలియజేస్తూ ఇన్వెస్ట్మెంట్ ఫ్రాడ్లు ముఖ్యంగా డబ్బులను వారి సొంత వెబ్సైట్ ల నందు ఇన్వెస్ట్మెంట్ చేసిన దానికన్నా ఎక్కువగా చూపిస్తారని ఒకవేళ డబ్బులను తీయాలి అనుకుంటే రాకుండా ఉంటాయని తెలియచేశారు.

జిల్లా పరిధిలో ప్రజలకు సైబర్ నేరాల పైన విస్తృతంగా అవగాహన కార్యక్రమలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఎస్పీ గారు తెలిపారు.

# నల్లమల్ల టైగర్ రిజర్వ్‌పై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆరా


**-- పెద్దపులుల పరిస్థితిపై జిల్లా కలెక్టర్, జిల్లా అటవీ అధికారితో చర్చ**
**-- 44 పులులు,164 చిరుతపులు, ఒక్క లక్ష జింకలు, ఉన్నాయని సీఎంకు వివరించిన కలెక్టర్**



నాగర్ కర్నూల్ జూలై 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి )
నాగర్‌కర్నూల్ జిల్లా నల్లమల్ల టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలోని పెద్దపులుల సంరక్షణ, వాటి సంఖ్య, అటవీ శాఖ చేపడుతున్న పరిరక్షణ చర్యలపై రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ఆసక్తి కనబరిచారు. శనివారం ఊర్కొండపేట శ్రీ ఆంజనేయస్వామి ఆలయ అభివృద్ధి పనులకు శంకుస్థాపన, ఆలయ దర్శనం తదితర కార్యక్రమాల నిమిత్తం జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి సందర్భంగా నల్లమల్ల అటవీ ప్రాంతంలో పులులు , చిరుతపులు, వన్యప్రాణుల పరిస్థితిపై ప్రత్యేకంగా ఆరా తీశారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ నల్లమల్ల టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో ఏర్పాటు చేసిన కెమెరా ట్రాప్‌లలో నమోదైన పెద్దపులుల అరుదైన ఛాయాచిత్రాలనుముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అందజేశారు. ఆ ఫోటోలను ముఖ్యమంత్రి ఆసక్తిగా పరిశీలిస్తూ నల్లమల్ల అటవీ ప్రాంతంలోని జీవవైవిధ్యం, వన్యప్రాణుల సంరక్షణ చర్యల గురించి అటవీ శాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు.అదే విధంగా రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జిల్లా అటవీ శాఖ అధికారి రేవంత్ చంద్ర నల్లమల్ల టైగర్ రిజర్వ్‌లో సంచరిస్తున్న పెద్దపులి చిత్రాన్ని అందజేశారు. నల్లమల్ల అటవీ ప్రాంత విశిష్టత, అక్కడి వన్యప్రాణుల సంపద, పెద్దపులుల సంరక్షణ కోసం అటవీ శాఖ చేపడుతున్న చర్యలను ఉప ముఖ్యమంత్రికి వివరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అచ్చంపేట డివిజన్ పరిధిలోని నల్లమల్ల టైగర్ రిజర్వ్‌లో ప్రస్తుతం ఎన్ని పెద్దపులులు ఉన్నాయో, వాటి సంరక్షణ కోసం ఎలాంటి చర్యలు చేపడుతున్నారో, వేటగాళ్ల కదలికలను అరికట్టేందుకు ఎలాంటి నిఘా వ్యవస్థ అమల్లో ఉందో జిల్లా కలెక్టర్‌ను అటవీ శాఖ అధికారిని అడిగి తెలుసుకున్నారు. అలాగే పులుల సంచార ప్రాంతాలు, వాటి ఆహార లభ్యత, అటవీ విస్తీర్ణం, వన్యప్రాణుల రక్షణకు తీసుకుంటున్న ప్రత్యేక చర్యలపై కూడా వివరాలు తెలుసుకున్నారు.
దీనికి జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ ముఖ్యమంత్రి కి వివరిస్తూ, ప్రస్తుతం నల్లమల్ల టైగర్ రిజర్వ్ అటవీ ప్రాంతంలో మొత్తం 44 పెద్దపులులు,164 చిరుత పులుల ,1 లక్ష జింకలు, ఇతర వన్యప్రాణులు ఉన్నట్లు ముఖ్యమంత్రికి వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాల మేరకు అటవీ శాఖ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ కెమెరా ట్రాప్‌లు, ప్రత్యేక పహారా బృందాలు, డ్రోన్ నిఘా, ఫీల్డ్ సిబ్బంది ద్వారా నిరంతర పర్యవేక్షణ చేపడుతోందని తెలిపారు. పులుల సంచారాన్ని శాస్త్రీయ పద్ధతుల్లో నమోదు చేస్తూ వాటి సంరక్షణకు అవసరమైన చర్యలు నిరంతరం అమలు చేస్తున్నామని కలెక్టర్, అటవీ శాఖ అధికారి వివరించారు.
నల్లమల్ల అటవీ ప్రాంతంలో పులుల సంఖ్య క్రమంగా పెరుగుతుండటం అక్కడి అటవీ పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యకరంగా ఉందనడానికి నిదర్శనమని అధికారులు వివరించారు. పెద్దపులులతో పాటు చిరుతలు,
ఎలుగుబంట్లు, అడవి కుక్కలు, సాంబార్ జింకలు, చీతల్ జింకలు, అడవి పందులు, నెమళ్లు తదితర అనేక రకాల వన్యప్రాణులు ఈ అటవీ ప్రాంతంలో సంచరిస్తున్నాయని తెలిపారు. నల్లమల్ల టైగర్ రిజర్వ్ జీవవైవిధ్య పరిరక్షణలో రాష్ట్రానికి అత్యంత కీలకమైన అటవీ ప్రాంతంగా గుర్తింపు పొందిందని ఈ సందర్భంగా అధికారులు తెలియజేశారు. పులుల సంరక్షణతో పాటు అటవీ సంపదను కాపాడేందుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతోందని, అటవీ శాఖ సిబ్బంది రాత్రింబవళ్లు శ్రమిస్తూ వన్యప్రాణుల రక్షణకు కట్టుబడి పనిచేస్తున్నారని వివరించారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నల్లమల్ల అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల సంరక్షణకు ప్రభుత్వం మరింత ప్రాధాన్యత ఇస్తుందని, పులుల సంఖ్యను పెంపొందించే దిశగా అవసరమైన అన్ని చర్యలకు రాష్ట్ర ప్రభుత్వం సంపూర్ణ సహకారం అందిస్తుందని అధికారులతో జరిగిన చర్చ సందర్భంగా పేర్కొన్నారు. రాష్ట్రంలోని అటవీ సంపదను భావితరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, జీవవైవిధ్య పరిరక్షణలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు.

## ఈ నెల 6న, ఉచిత రెబీస్ టీకాల పంపిణి

**-జిల్లా వైద్యాధికారి డాక్టర్.జ్ఞానశేఖర్**



నాగర్‌కర్నూల్: జూలై 04 (ప్రజా జ్యోతి)
ప్రతి సంవత్సరం నిర్వహించే వరల్డ్ జూనోసిస్ డే కార్యక్రమంలో భాగంగా ఈ నెల 6 న, పెంపుడు జంతువులకు ఉచిత రెబీస్ టీకాలు వేస్తున్నట్లు
జిల్లా వైద్యాధికారి డాక్టర్.జ్ఞానశేఖర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జంతువుల నుంచి మనుషులకు సంక్రమించే వ్యాధులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడమే "వరల్డ్ జూనోసిస్ డే" ముఖ్య ఉద్దేశమని,రెబీస్ వ్యాధి ప్రాణాంతకమైనదని, కుక్కలు,పిల్లులు వంటి పెంపుడు జంతువులకు సకాలంలో టీకాలు వేయించడం ద్వారా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని,జిల్లాలో ప్రత్యేకంగా ఉచిత రెబీస్ టీకా కార్యక్రమాన్ని ఉదయం 9:00గంటల నుండి 1:00 గంట వరకు నిర్వహిస్తామని పెంపుడు జంతువుల యజమానులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ జంతువులకు తప్పనిసరిగా టీకాలు వేయించాలని రెబీస్‌నివారణలో ప్రజల భాగస్వామ్యం కీలకమని, జంతువులు అసాధారణ ప్రవర్తన కనబరిస్తే వెంటనే పశువైద్యులను సంప్రదించాలని,కుక్క లేదా ఇతర జంతువు కరిచిన వెంటనే గాయాన్ని సబ్బు,నీటితో బాగా కడిగి,ఆలస్యం చేయకుండా సమీప ఆసుపత్రిని సంప్రదించి అవసరమైన చికిత్స,రెబీస్ వ్యాక్సిన్ తీసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.వరల్డ్ జూనోసిస్ డే సందర్భంగా జంతువుల,ప్రజల ఆరోగ్య పరిరక్షణకు అందరు సహకరించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ జ్ఞాన శేఖర్ పిలుపునిచ్చారు.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు భద్రత పునరుద్ధరించాలి: బీఆర్ఎస్ నాయకుల డిమాండ్

**- భద్రత తగ్గింపుపై నిరసన.. జిల్లా ఎస్పీకి వినతిపత్రం**

**వనపర్తి, జూలై 4 (ప్రజాజ్యోతి):** మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ప్రభుత్వం కల్పించిన భద్రతను తగ్గించడం అనైతిక చర్య అని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. ప్రశ్నించే గొంతుకలను అణచివేసే కక్షసాధింపు చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని ఆరోపించారు. ఈ మేరకు జిల్లా మాజీ అధ్యక్షుడు గట్టు యాదవ్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో శనివారం బీఆర్ఎస్ శ్రేణులు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ రాష్ట్రంలో రెండేళ్లుగా అరాచక, అవినీతి పాలన కొనసాగుతోందని ఆరోపించారు. ప్రభుత్వ విధానాలను మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ ప్రశ్నిస్తున్నందుకే ముందస్తు సమాచారం లేకుండా ఆయన భద్రతను తగ్గించారని విమర్శించారు. ఐపీఎస్ అధికారిగా రాష్ట్రానికి సుదీర్ఘ సేవలు అందించిన వ్యక్తికి ప్రభుత్వం ఇస్తున్న గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. అలాగే ఆయన సతీమణి మహాలక్ష్మిని ప్రాధాన్యం లేని శాఖకు బదిలీ చేయడం కూడా కక్షసాధింపు చర్యేనని ఆరోపించారు. ప్రవీణ్ కుమార్‌కు ప్రభుత్వం రక్షణ కల్పించకపోయినా ప్రజలే అండగా ఉంటారని, ఆయనకు ఏదైనా అపాయం జరిగితే ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. అనంతరం మాజీ ఐపీఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు గతంలో ఉన్న భద్రతను యథావిధిగా కొనసాగించాలని కోరుతూ జిల్లా ఎస్పీ డి. సునీతా రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, జిల్లా మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, మాజీ జెడ్పీటీసీ పద్మ వెంకటేష్, ధర్మా నాయక్, గంధం పరంజ్యోతి, కె. మాణిక్యం, వనం రాములు, ఉంగ్లం తిరుమల్, జాత్య నాయక్, దొడ్డ రాములు, విజయ్ కుమార్, భారతి, ప్రేమ్‌నాథ్ రెడ్డి, అరుణ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## అనాధలకు..దారి చూపిన ఆత్మబంధువు..!



నర్వ జులై 4 (ప్రజా జ్యోతి
అమ్మానాన్నలను కోల్పోయిన అనాథలకు దారి చూపిన మానవత్వం గల మహనీయుడు హిందీ పండిత్, జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ కందుకూరి అశోక్ కుమార్. నారాయణపేట జిల్లా నర్వ మండల కేంద్రానికి చెందిన మ్యాతరి అలివేలు ఆమె భర్త కురుమూర్తి ఇటీవల అనారోగ్యంతో తనువం చాలించారు. వారి మగసంతానం ఇద్దరు అఖిల్ (8), అభి (6) అనాథలయ్యారు. అనాథలుగా మారిన ఆ చిన్నారుల గురించి వివిధ పత్రికల్లో వార్తలు ప్రచురితమయ్యాయి. విషయం తెలుసుకున్న హిందీ పండిత్, జూనియర్ రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ కందుకూరి అశోక్ కుమార్ హృదయం చలించిపోయింది. వారికి ఎలాగైనా దారిచూపాలనే తపనతో మహబూబ్ నగర్ జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ లయన్ డాక్టర్ అంబటి నటరాజ్ ను సంప్రదించారు. ఆయన సూచన మేరకు మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని 'సన్నిధి' ఆశ్రమానికి చేర్చారు. చిన్నారులకు మంచి భవిష్యత్తు ఇవ్వాలని, మానవసేవయే మాధవ సేవగా భావించి సన్నిధి ఆశ్రమంలో చేర్పించామని ఈ సందర్భంగా తెలిపారు. అశోక్ కుమార్ చొరవను గ్రామ సర్పంచ్, ఆయన అభిమానులు, స్నేహితులు ప్రశంసించారు.

## దివ్యాంగుల పరిరక్షణ కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

**-అధ్యక్షుడిగా కొప్పునూరు సైదులు**



నాగర్ కర్నూల్ : జులై 04 : (ప్రజా జ్యోతి)
తాడూరు మండలంలో శనివారం దివ్యాంగులజిల్లా పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో తాడూర్ దివ్యాంగుల మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు,జిల్లా అధ్యక్షుడు నరందాస్ శ్రీశైలం,కార్యదర్శి పరశురాములు శనివారం ప్రకటనలోతెలిపారు.మండల అధ్యక్షుడిగా కొప్పునూరుసైదులు,ప్రధాన కార్యదర్శిగా క్రమ జమఖన్,కార్యదర్శిగా బురాన్,ఉపాధ్యక్షులుగా తిరుమదాస్ శివకుమార్ గౌడ్,బాలాజీ,ప్రచార కార్యదర్శిగా భరత్,గౌరవాధ్యక్షుడిగా మేఘనాథ్,కార్యవర్గ సభ్యులు జయ శేఖర్,శివశంకర్,హుస్సేన్,నాసిర్, పర్వతాలు,వెంకటయ్య,సుదర్శన్ లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.కమిటీ మండలంలోని దివ్యాంగుల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో మంతటి శేఖర్,తదితరులు పాల్గొన్నారు.

## అంజన్న సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే గువ్వల

నాగర్ కర్నూల్ జూలై 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)
నాగర్ కర్నూల్ జిల్లా అచ్చంపేట నియోజకవర్గం పదర మండలం మద్దిమడుగు గ్రామంలో స్వయంభూగా వెలసిన శ్రీ పబ్బతి ఆంజనేయ స్వామి ఆలయంలో మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ శనివారం బిజెపి శ్రేణులతో కలిసి, సందర్శించి ప్రత్యేక పూజలు గావించారు. ఆలయ అర్చకులు మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజ్ కి శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం మద్ది మడుగు సర్పంచ్ అంజి కుటుంబాన్ని బిజెపి శ్రేణులతో కలిసి పరామర్శించారు. అదే మాదిరిగా బిజెపి సీనియర్ నాయకుడు గోలి శ్రీను తండ్రి దశదినకర్మ కార్యక్రమంలో పాల్గొని, ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు మంగ్యా నాయక్, శ్రీను నాయక్, జిల్లా బిజెపి మహిళా నాయకురాలు బల్మూరి జానకి నాయకులు, కార్యకర్తలు , కుటుంబ సభ్యులు తదితరులు ఉన్నారు



# విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకుని బాధ్యతాయుత పౌరులుగా ఎదగాలి

- షీ టీమ్ పోలీసులు
-జాజాపూర్ గ్రామంలో విద్యార్థులకు పలు సామాజిక అంశాలపై అవగాహన కార్యక్రమం
-మహిళల భద్రత, సైబర్ నేరాలు, బాల్య వివాహాలు, మాదకద్రవ్యాల నివారణపై సూచనలు




**నారాయణపేట ప్రతినిధి జూలై 04 (ప్రజా జ్యోతి)**
జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఆదేశాల మేరకు, మహిళలు, బాలికల భద్రతతో పాటు విద్యార్థుల్లో చట్టాలపై అవగాహన పెంపొందించే లక్ష్యంతో జిల్లా షీ టీమ్ పోలీసులు జాజాపూర్ గ్రామంలోని విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా షీ టీమ్ పోలీసులు బాలరాజు, చెన్నప్ప లు మాట్లాడుతూ... విద్యార్థులు తమ విద్యతో పాటు సమాజంలో జరుగుతున్న పరిణామాలు, చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు ఎలాంటి వేధింపులు ఎదురైనా భయపడకుండా వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు లేదా పోలీసులను సంప్రదించాలని తెలిపారు. మహిళలు, బాలికల రక్షణ కోసం తెలంగాణ పోలీసు శాఖ ఏర్పాటు చేసిన షీ టీమ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈవ్‌టీజింగ్, వేధింపులు, సోషల్ మీడియాలో అసభ్యకర సందేశాలు, నకిలీ సోషల్ మీడియా ఖాతాల ద్వారా జరిగే మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం పెరుగుతున్న సైబర్ నేరాల నేపథ్యంలో అపరిచిత వ్యక్తుల ఫోన్ కాల్స్, లింకులు, ఓటీపీలు, బ్యాంకు వివరాలను ఎవరికీ వెల్లడించకూడదని వివరించారు. ఏదైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయడం లేదా సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. అలాగే మాదకద్రవ్యాలు, గంజాయి, మద్యం వంటి వ్యసనాలకు పూర్తిగా దూరంగా ఉండాలని, బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, పిల్లలపై జరిగే నేరాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాణాలను కాపాడుతుందని చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు సేవల కోసం డయల్ 100/112, మహిళల భద్రత కోసం షీ టీమ్, సైబర్ మోసాల కోసం 1930 హెల్ప్‌లైన్ సేవలను వినియోగించాలని విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో షి టీమ్ పోలీసులు జ్యోతి, కవిత ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జీవితంలో విద్యార్థి దశ కీలకం

-చక్కగా చదివి గొప్ప స్థాయికి ఎదగాలి
-లీగల్ సర్వీసెస్ అథారిటి సెక్రటరీ ఏ.శ్రీదేవి



**నాగర్ కర్నూల్ : జూలై 04 (ప్రజా జ్యోతి)**
రాష్ట్ర హైకోర్టు ఆదేశానుసారం జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పట్టణం లోని జ్ఞానేశ్వర వాత్సల్య మందిరం చిల్డ్రన్ హోమ్ (బాలురు)ను డిస్ట్రిక్ లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ ఏ.శ్రీదేవి సందర్శించారు. ఈ సందర్భంగా చిన్నారులతో మాట్లాడుతూ యోగ క్షేమాలను తెలుసుకొని మెనూ ప్రకారం ఆహారం ఇస్తున్నారా అని ఆరా తీసారు. అనంతరం వారిచే పాటలు పాడించి ఉత్సాహపరిచారు. జీవితంలో విద్యార్థి దశ అనేది కీలక దశ కాబట్టి అందరూ చక్కగా చదివి జీవితంలో గొప్పస్థాయికి చేరుకోవాలనిఅన్నారు. మీకు ఏమైనా సహాయం కావాలంటే మా సంస్థ తరపున సహాయం అందిస్తామన్నారు. అనంతరం చిన్నారులకు అరటి పండ్లు,బిస్కట్ ప్యాకెట్లు పంపిణీచేసారు. కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ శ్రీరామ్ ఆర్య, చిల్డ్రన్ హోమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

# హిందూ సంఘటితమే ఆర్ఎస్ఎస్ లక్ష్యం

**వ్యక్తి సంపాదనలో సమాజానికి దానం చేసే గుణాన్ని అలవర్చుకోవాలి**
**భారతదేశ సాంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవి**




నారాయణపేట ప్రతినిధి జూలై 04 (ప్రజా జ్యోతి)

హిందూ సంఘటితమే ఆర్ఎస్ఎస్ లక్ష్యమని ప్రాంత కార్యకారిణి సభ్యులు రాంపల్లి మల్లికార్జున్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ఎస్ ఆర్ గార్డెన్ ఫంక్షన్ హాల్లో శనివారం సాయంత్రం రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘం నగరశాఖ ఆధ్వర్యంలో గురుపూజ ఉత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ ఉత్సవానికి ముఖ్య అతిథులుగా నగర సంగ చాలక్ డాక్టర్ మదన్ మోహన్ రెడ్డి, బాలాజీ ఎక్స్‌పోట్, ముఖ్య వక్త రాంపల్లి మల్లికార్జు న్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ముఖ్య వక్త రాంపల్లి మల్లికార్జున్ మాట్లాడుతూ ఎవరైతే సమాజంలో పనిచేయకుండా ఉంటారో... దాన గుణం లేని వారి నుంచి సమాజానికి ప్రయోజనం ఏమీ లేదన్నారు. ప్రతి ఒక్కరు తమకోసం తమ కుటుంబం కోసం పనిచేయడం అలవర్చుకోవాలని... సమాజ శ్రేయస్సు కోసం దానగుణం కలిగి ఉండాలన్నారు. ఈ భూమి పుట్టి ఎన్నో కోట్ల సంవత్సరాలు పూర్తయిందని గుర్తు చేశారు. భూమి పుట్టిన తర్వాత ఈ భూమిపై జరిగిన అంశాల గురించి పురాణాలు ఇతిహాసాలు మనకు ఎన్నో విషయాలు తెలియజేస్తున్నాయన్నారు. భారతదేశ సాంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవన్నారు. జులై 4 నుంచి 15వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా గురుపూజ గురు దక్షిణ కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ముందుండాలన్నారు. ఆనాడు బ్రిటీష్ ప్రభుత్వం అరాచకాలకు వ్యతిరేకంగా ఎన్నో పోరాటాలు జరిగాయని తెలిపారు. దేశవ్యాప్తంగా 40 కి పైగా జాతీయ సంస్థలు సమాజ శ్రేయస్సు కోసం పాటుపడుతున్నాయన్నారు. అందులో భాగంగానే ఆర్ఎస్ఎస్, ఏబీవీపీ లాంటివి సంస్థలు ఆవిర్భవించాయన్నారు. రాజకీయ పార్టీలతో సంబంధం లేకుండా ఆర్ఎస్ఎస్ పనిచేస్తుందన్నారు. అనాదిగా వస్తున్న గోసంరక్షణ ధర్మ సంరక్షణ, ధర్మ జాగరణ, పర్యావరణ పరిరక్షణ లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలన్నారు. పౌరుడిగా ప్రతి ఒక్కరూ తన బాధ్యతను సమాజంలో నిర్వర్తించాలని కోరారు.

# తెలంగాణ సాయుధపోరాట తొలి అమరుడు దొడ్డి కొమరయ్య 80వ వర్ధంతి



**నారాయణపేట ప్రతినిధి జూలై 04 (ప్రజా జ్యోతి)**
సిపిఎంఆధ్వర్యం లో నారాయణపేట జిల్లా కేంద్రంలో దొడ్డి కొమురయ్య వర్ధంతి జరిపారు. సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి జీ వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ దొడ్డి కొమరయ్య. ఊరు కడివెంది, జనగామ జిల్లాలో అప్పట్లో నిజాం రాజు, దొరలు, దేశ్‌ముఖ్‌లు పేద రైతులను, కూలీలను బానిసల్లా చూసేవారు. వెట్టి చాకిరి, భూమి లాక్కోవడం. దానికి వ్యతిరేకంగా ఆంధ్ర మహాసభ, కమ్యూనిస్ట్ పార్టీ పోరాటం మొదలుపెట్టింది. దొడ్డి కొమరయ్య ఒక పేద యాదవ కులానికి చెందిన గొర్రెల కాపరి. కానీ ఆయనలో అన్యాయం మీద తిరుగుబాటు ఉంది. జులై 4, 1946 న దొర విసునూర్ రామచంద్రారెడ్డి గుండాలు గ్రామం మీద పడ్డారు. సంఘం ఆఫీస్ లాక్కుందామని వచ్చారు. కొమరయ్య ఒక్కడే కాదు, ఊరు ఊరంతా కర్రలు, రాళ్లతో ఎదురు తిరిగింది. ఆ దాడిలో గుండాలు జరిపిన కాల్పుల్లో దొడ్డి కొమరయ్య అమరుడయ్యాడు. ఆయన తెలంగాణ రైతాంగా సాయుద పోరాట తొలి అమరుడు అని అన్నారు. ఈ కార్యక్రమం లో సీపీఎం నాయకులు బండమీది బలరాం నరహరి, పవన్ సిపిఎం సోషల్ మీడియా వరియార్ సోఫీ మజర్ ఉసేన్ తదితరులు పాల్గొన్నారు.



# మండల సర్వేయర్ జయశంకర్ మీద తహసిల్దార్ కి ఫిర్యాదు

**నారాయణపేట ప్రతినిధి జూలై 4 (ప్రజా జ్యోతి)**
నారాయణపేట మండలం సర్వేర్ జయశంకర్ మీద తహసిల్దార్ అమరేందర్ కృష్ణకు వినతి పత్రాన్ని ఇచ్చారు నారాయణపేట మండలం జలాల్పూర్ గ్రామ సర్పంచ్ మాలింగప్ప గ్రామ ప్రజలు, ప్రభుత్వం భూములను కాపాడాల్సిన సర్వే ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రభుత్వ భూములకు త్రికంగా సర్వే చేయడం కాకుండా తప్పుడు నివేదికలు సమర్పిస్తున్న సర్వార్ మీద చర్యలు తీసుకోవాలని వినతి పత్రాన్ని ఇచ్చారు, నారాయణపేట మండలం గ్రామం జలాల్పూర్ సర్వే నంబర్ 56,57 సర్వే నంబర్లు ఈ వాస్తవంగా ప్రభుత్వ భూములు కానీ సర్వేయర్ జయశంకర్ ఈ భూములను తప్పుగా చూపించడం వల్ల అవి ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లోకి వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడింది, ప్రభుత్వ భవనాలు కట్టాలంటే గ్రామ ప్రజలకు గ్రామ కార్యాలయాలకు ఇబ్బందిగా ఏర్పడింది, కాబట్టి ఇలాంటి తప్పుడు సర్వే నివేదికలు సమర్పించిన సర్వార్ మీద పూర్తిస్థాయి విచారణ చేసి అవసరమైతే మళ్లీ రీ సర్వే చేసి ప్రభుత్వ భూమిని గ్రామపంచాయతీకి అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు, అదే సర్వే నంబర్లు ప్రభుత్వ భవనాలైనా పశువైద్యశాల, ప్రభుత్వ భవనం నిర్మించి ఉంది, కానీ సర్వేర్ నిర్లక్ష్యంతో ప్రభుత్వ స్థలాన్ని ఆ సర్వే నెంబర్లను సర్వేర్లు చూపియకుండా ప్రైవేట్ వ్యక్తులకు అప్పజెప్పే ప్రయత్నం చేయడం జరుగుతుంది, స్థానిక తాసిల్దార్ ఉన్నతాధికారులు స్పందించి సర్వేర్ మీద విచారణ జరిపించి ప్రభుత్వ స్థలాలని కాపాడాలని గ్రామంలోని 56 57 సర్వే నంబర్లు గ్రామపంచాయతీకి అప్పజెప్పాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ ప్రజలు, నరసప్ప బాలరాజ్ మొగులప్ప, శివలింగప్ప, చంద్రప్ప, గురు స్వామి, భరత్ కుమార్ మల్లప్ప తదితరులు పాల్గొన్నారు



# అక్రమభూమి.. బదలాయింపు అవాస్తవం..?

- అక్రమ చేయలేదు... ఆ భూమి వారసత్వ భూమి మాది
- నల్లమల్ల ప్రాంతంలో చెంచుల భూములు అన్యాక్రాంతం
- దాసరి మల్లికార్జున్



**నాగర్ కర్నూల్ జులై 4 (ప్రజా జ్యోతి జిల్లా ప్రతినిధి)**

నాగర్ కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం వెంకటేశ్వర్ల భావి గ్రామం శివారు తుర్కపల్లి గ్రామంలోని సర్వే నెంబర్ 124 / ఈ లో 14 గుంటల భూమిని రెవెన్యూ శాఖలో టైపిస్టుగా వృత్తిలో కొనసాగుతున్న దాసరి మల్లికార్జున్ అక్రమంగా తమ భూమిని మల్లికార్జున్ రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని శుక్రవారం ఆర్డిఓ యాదగిరికి వెంకటేశ్వర్లు భాయ్ గ్రామానికి చెందిన అనంత వెంకటమ్మ భర్త అనంతరాములు తుర్కపల్లి శివారులోని సర్వే నెంబర్లో 14 గుంటల భూమి అక్రమంగా రిజిస్టర్ చేసుకోవడం జరిగిందని నాపై అవస్థ ఆరోపణలు ఆర్డిఓ యాదగిరి కి చేయడం జరిగిందని టైపిస్ట్ దాసరి మల్లికార్జున్ తెలిపారు. ఇదిలా తెలిపారుఉండగా మా తాతగారైన దాసరి బుడ్డయ్య సన్నాఫ్ చిన్నయ్య వారసత్వం భూమిని 14 గుంటలు నా పేరు మీద చేసుకోవడం జరిగిందని టైపిస్ట్ దాసరి మల్లికార్జున్ స్పష్టం చేశారు. మా తాత కుమారులకు ఒక్కొక్కరికి సర్వే నెంబర్లలో మూడు ఎకరాల గుంటల పైన రిజిస్ట్రేషన్ చేయడం జరిగిందని తెలిపారు. కాగా మా పెద్ద అత్తమ్మ ఆయన లింగమ్మకు ఐదు ఎకరాల భూమిని ఇవ్వడం జరిగిందని.. ఆ సర్వే నెంబర్లు 124/ ఈ లో 5 ఎకరాల భూమి మా అత్తగారి పేరు పైన పట్టా భూమిగా నమోదయిందని.. ఆ సర్వే నెంబర్లు అనంత వెంకటమ్మ భర్త అనంతరాములు పై ఎలా రిజిస్ట్రేషన్ అయిందో దానికి సంబంధించిన డాక్యుమెంట్లను చూపించాలని ఆయన డిమాండ్ చేశారు. వారే వారసత్వంగా వస్తున్న చెంచుల భూమిలో మూడు ఎకరాల 20 గుంటల భూమి ఎలా రిజిస్ట్రేషన్ అయ్యిందని ఆయన ప్రశ్నించారు. చెంచుల వారసత్వం అయిన భూమిలో వారు అక్రమంగా కబ్జా చేసుకుని మూడు ఎకరాల 20 గుంటల భూమి వారి పేరుపైన వారిగతంలో అక్రమ రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని మల్లికార్జున్ స్పష్టం చేశారు. ఆ సర్వే నెంబర్ లో 14 గుంటల భూమి నేను అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకోవడం జరిగిందని వారి ఆరోపణల్లో వాస్తవం లేదని నా పేరు మీద ఉన్న భూమి వారసత్వ సక్రమ భూమి అని... శనివారం దస్త్రాలు చూపిస్తే దేనికైనా రెడీ అని వివరణలో దాసరి మల్లికార్జున్ పేర్కొన్నారు.

**ముమ్మాటికి చెంచుల మా వారసత్వ భూమి అది:**
**టైపిస్ట్ దాసరి మల్లికార్జున్**

మా తాతగారైన దాసరి బుడ్డయ్య సన్నాఫ్ చిన్నయ్య సర్వేనెంబర్ 124/ ఈలో 14 గుంటలు వారసత్వ భూమి లోనే 14 గుంటల భూమి నా పేరు మీద రిజిస్టర్ అయి ఉందని నేను ఎలాంటి అక్రమాలకు పాల్పడలేదని వారసత్వ భూమి నాది అని విలేఖరికి వివరణలు తెలిపారు. అదే మాదిరిగా గతంలో మా అత్త లింగమ్మ పేరు పైన ఉన్న ఐదు ఎకరాల భూమి అదే సర్వే నెంబర్లు అనంత వెంకటమ్మ భర్త అనంతరాములు పై మూడు ఎకరాల 20 గుంటలు ఎలా రిజిస్ట్రేషన్ అయిందని ఆయన ప్రశ్నించారు. అచ్చంపేట నియోజకవర్గంలోని వివిధ మండలాల్లో ఉన్న చెంచుల భూములకు రక్షణ లేకుండా పోయిందని ఆయన వాపోయారు. చెంచుల భూములపై కన్నేసి ఎన్నో ఎకరాల భూములు కబ్జా చేశారని వివరణలో ఆయన పేర్కొన్నారు.

# ప్రశాంతంగా ముగిసిన ముఖ్యమంత్రి పర్యటన

**-అడుగడుగునా కట్టుదిట్టమైన బందోబస్తు**
**-జిల్లా ఎస్పీ సంగ్రామ్ సింగ్ జి పాటిల్**

**నాగర్ కర్నూల్ : జులై 04 (ప్రజా జ్యోతి)**



నాగర్‌కర్నూల్ జిల్లాకు వచ్చిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి పర్యటనను ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేసినట్లు జిల్లా ఎస్పీడా.సంగ్రామ్ సింగ్ పాటిల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో అన్ని శాఖలు సమన్వయంతో విస్తృతంగా ఏర్పాట్లు చేపట్టగా పోలీసు శాఖ ఆధ్వర్యంలో 490 మంది పోలీసు అధికారులు,సిబ్బందితో బహుళస్థాయి భద్రతా చర్యలు అమలుచేయడం జరిగిందని,హెలిప్యాడ్, వీఐపీ మార్గాలు,పార్కింగ్ ప్రాంతాలు,సమావేశ ప్రదేశాలు తదితర కీలక ప్రాంతాల్లో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటుచేసి ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం చేయడం జరిగిందని నిరంతరం పర్యవేక్షిస్తూ,భద్రతా చర్యల్ని సమీక్షిస్తూ పోలీసు యంత్రాంగానికి దిశా నిర్దేశం చేసి కార్యక్రమాన్ని ప్రశాంతంగా విజయవంతంగా ముగించినట్లు ఎస్పీ తెలిపారు.ముఖ్యమంత్రి పర్యటన విజయవంతం కావడంలో పోలీసు శాఖతో పాటు వివిధ శాఖల అధికారులు,సిబ్బంది సమిష్టిగా కృషి చేశారని, బందోబస్తు విధుల్లో అత్యంత అంకితభావంతో పనిచేసిన ప్రతి పోలీసు అధికారి,సిబ్బందిని జిల్లా ఎస్పీ ప్రశంసించారు.

# ప్రభుత్వ పాఠశాలలో మిడ్ డే మీల్స్ విఫలం

## అధికారుల నిర్లక్ష్యంతో విద్యార్థుల ఆకలి కేకలు

**నారాయణపేట ప్రతినిధి జూలై 04 (ప్రజా జ్యోతి)**

ఈరోజు అఖిల భారత విద్యార్థి పరిషత్ నారాయణపేట శాఖ ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన పరిశీలన కార్యక్రమంలో భాగంగా నారాయణపేట పట్టణంలోని గ్రౌండ్ స్కూల్ ప్రభుత్వ ఉన్నంత పాఠశాలలో 800 మంది విద్యార్థులు ఉన్న పాఠశాలలో సగానికి పైగా మధ్యాహ్న భోజనానికి టిఫిన్లు ఇంటి నుండే తీసుకురావడం అదేవిధంగా ఏ ఒక్క విద్యార్థి కూడా కావాల్సినంత ఆహారం ఇవ్వకపోవడం అడిగిన విద్యార్థులపై విరుచుకపడడం చాలా బాధాకరమైన విషయం అదే విధంగా అక్కడున్న మిడ్ డే మీల్స్ నిర్వహిస్తున్న పనివాళ్ళు ఎవరికి కూడా సరిపడినంత ఆహారం ఈరోజు వరకు ఎప్పుడూ ఉండలేదు మెనూ ప్రకారం ఒక్కరోజు అంటే ఒక్కరోజు కూడా పాటించకుండా తన ఇష్టానుసారంగా రోజు 20 బియ్యం కాజేస్తూ విద్యార్థుల పుట్టగొడుతున్న ఎవ్వరు పట్టించుకోకుండా ఉండడంతో దీంట్లో ఈ యొక్క విషయం లోపల అనేకమంది అధికారులు కుమ్మక్కై విద్యార్థుల కొట్టకూడదు లంచాలు తింటూ ఒకే అధికారి ఎల్ల తరబడి ఉండడంతో పాఠశాలతో మిడ్ డే మీల్స్ వారితో సంబంధాలు పెట్టుకొని జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు ఎక్కడో దగ్గర ఫుడ్ పైజాన్ కావడం అనేక సమస్యలతో జిల్లా మొత్తం మిడ్ డే మీల్స్ ని దుర్వినియోగం చేస్తూ విద్యార్థులతో చెలగాటమాడుతున్న అధికారుల పైన మధ్యాహ్న భోజనంలో



పనిచేస్తున్న వ్యక్తులపైన వెంటనే చర్యలు తీసుకోవాలని మిడ్ డే మీల్స్ పైన జిల్లా వ్యాప్తంగా , డి ఈ ఓ , ఎంఈఓ లు పరిశీలిస్తూ ఎక్కడ కూడా పొరపాట్లు జరగనట్లు చూడాలని ఏ ఒక్క పాఠశాలలో మిడ్ డే మీల్స్ సక్రమంగా నడిపించకపోతే దానిపైన వెంటనే చర్యలు తీసుకోకపోతే అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ( ఏబీవీపీ) తీవ్రంగా ఖండిస్తున్నాం లేనియెడల పెద్ద ఎత్తున ఉద్యమాలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలియజేస్తున్నాం ఈ కార్యక్రమంలో జిల్లా కన్వీనర్ నరేష్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శివ నగర కార్యదర్శి సతీష్, ఇంతియాజ్, చరణ్ రెడ్డి, రోహిత్, మనీ, అజయ్, తరుణ్, ఇతర కార్యకర్తలు పాల్గొనడం జరిగింది.

# బాలసదనం, వృద్ధాశ్రమం ఆకస్మిక తనిఖీ

**చదువు మన బంగారు భవిష్యత్తు - సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్**

**నారాయణపేట ప్రతినిధి జూలై 04 (ప్రజా జ్యోతి)**

శనివారం నారాయణపేట పట్టణంలోని బారం బావి వద్ద ఉన్న వృద్ధాశ్రమం, బాలసదనాన్ని సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరు పట్టికను పరిశీలించి, హోమ్‌లో ఎంతమంది వృద్ధులు, చిన్నారులు ఉన్నారో ఆరా తీశారు. మెనూ ప్రకారం భోజనంపెడుతున్నారా లేదా అని తనిఖీ చేశారు. రోజూ తాజా కూరగాయలు, నాణ్యమైన బియ్యంతో వంట చేయాలని, తాగునీటి విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించవద్దని సిబ్బందిని ఆదేశించారు.ఈ సందర్భంగా స్టాక్ రిజిస్టర్, మూవ్‌మెంట్ రిజిస్టర్, అడ్మిషన్ రిజిస్టర్, డైలీ డైరీలతో పాటు సీసీటీవీ ఫుటేజ్‌లను క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యాలయ ఆర్డర్ల ప్రకారమే అడ్మిషన్లు తీసుకుంటున్నారా, సంబంధిత వ్యక్తులకు పిల్లలను, వృద్ధులను అప్పగిస్తున్నారా అనే విషయాలను అడిగి తెలుసుకున్నారు. హోమ్‌లో నిల్వ ఉంచిన మందులు, టాబ్లెట్లు, సిరప్‌ల ఎక్స్‌పైరీ మందులు వెంటనే తొలగించాలని సూచించారు.అనంతరం వృద్ధులు, చిన్నారులతో నేరుగా మాట్లాడి వారి ఆరోగ్య సమస్యలు, ఇతర అవసరాలను అడిగి తెలుసుకున్నారు. అక్కడ వున్నా చైల్డ్ మ్యారేజ్ వారితో మాట్లాడి వారికీ పిఓపిఎస్ఓ ఆక్ట్ గురించి అవగాహనా కల్పించారు. వారి బంధువుల వివరాలు కూడా అడిగి తెలుసుకున్నారు . బెడ్ రూమ్‌లు, బాత్‌రూమ్‌లు, వాష్‌రూమ్‌లు ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచాలని, లైట్లు, ఫ్యాన్లు పనిచేసేలా చూడాలని ఆదేశించారు. కొనుగోలు చేసిన ప్రతి వస్తువుకు బిల్లులు తీసుకొని రిజిస్టర్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ఏదైనా సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లాలని ఆదేశించారు.



# ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియపై తహసీల్దార్ ఆకస్మిక తనిఖీ

**చిన్నంబావి జులై 4 (ప్రజా జ్యోతి)**

చిన్నంబావి మండల పరిధిలోని పెద్దమారూర్ గ్రామంలోని బీసీ,కాలనీల్లో కొనసాగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా (ఎస్ఐఆర్) నమోదు ప్రక్రియను మండల తహసీల్దార్ కె.శ్రీనివాస్ శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా బూత్ లెవల్ అధికారులకు పలు సూచనలు చేశారు. ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీని వేగవంతం చేయాలని, ఆన్‌లైన్ డేటా ఎంట్రీ శాతం తక్కువగా ఉన్నందున ఎప్పటికప్పుడు వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు.అలాగే ఎస్ఐఆర్ ప్రక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వకుండా ప్రతి ఇంటికి వెళ్లి ప్రతి ఓటరును వ్యక్తిగతంగా కలిసి నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పిస్తూ, నిర్ణీత గడువులోగా ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేయాలని తెలిపారు.విధులకు సకాలంలో హాజరుకాని జీపీఓపై తహసీల్దార్ ఆగ్రహం వ్యక్తం చేశారు.ఈ తనిఖీలో గ్రామ పంచాయతీ కార్యదర్శి బి. శ్రీనివాసులు, బీఎల్ఓలు బి. గోవిందమ్మ, కె. గోవిందమ్మ, లొంక అరుణ, జీపీఓలు విజయ్ కుమార్, మధు తదితరులు పాల్గొన్నారు.




# డాక్టర్ అర్ ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత పెంచాలి

**వెంటనే బుల్లెట్ ప్రూఫ్ కారు, సెక్యూరిటీని పునరుద్ధరించాలి**

**చిన్నంబావి మండల మాజీ ఎంపీపీ, సోమేశ్వరమ్మ మాజీ జెడ్పీటీసీ.కేసిరెడ్డి వెంకట్రామమ్మ చిన్నా రెడ్డి**

**చిన్నంబావి, జులై 4 (ప్రజాజ్యోతి)**

చిన్నంబావి మండల మాజీ జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకట్రామమ్మ చిన్నారెడ్డి, మాజీ ఎంపీపీ టి. సోమేశ్వరమ్మ మధుసూదన్ రెడ్డి ప్రభుత్వం మాజీ ఐపీఎస్ అధికారి, బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు తక్షణమే భద్రత పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బడుగు, బలహీన వర్గాలకు ఆశాజ్యోతిగా నిలిచిన ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు కక్షసాధింపు చర్యల్లో భాగంగా భద్రతను తగ్గించడం ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిదర్శనమని విమర్శించారు. దేశానికి ఎన్నో సంవత్సరాలు నిజాయితీగా సేవలందించిన మాజీ ఐపీఎస్ అధికారికి భద్రతను తగ్గించడం దుర్మార్గమని, ఆందోళనకరమని పేర్కొన్నారు. ప్రజా సమస్యలపై నిరంతరం తన గొంతు వినిపిస్తున్న ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ భద్రత విషయంలో ప్రభుత్వం రాజకీయాలకు అతీతంగా వ్యవహరించాలని కోరారు. ఆయనకు ఎలాంటి హాని జరిగినా కాంగ్రెస్ ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్‌కు తక్షణమే భద్రత పునరుద్ధరించి, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని చిన్నంబావి మండల మాజీ మహిళా ప్రజా ప్రతినిధులు డిమాండ్ చేశారు.



# తెలంగాణ సాయుధ పోరాట వీరుడు “దొడ్డి కొమురయ్య”

**నారాయణపేట ప్రతినిధి జూలై 04 (ప్రజా జ్యోతి)**

నిజాం నిరంకుశ పాలనలో ప్రజల సంక్షేమం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ ఉద్యమంలో దొడ్డి కొమురయ్య అలుపెరుగని పోరాటం చేశారని అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీను అన్నారు. శనివారం జిల్లా కేంద్రంలోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన దొడ్డి కొమరయ్య వర్ధంతి హాజరై దొడ్డి కొమురయ్య చిత్రపటం వద్ద జ్యోతిని వెలిగించి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగ అదనపు కలెక్టర్ మాట్లాడుతూ నిజాం నిరంకుశ పాలనలో అణిచివేతకు గురవుతున్న ప్రజల ఆత్మగౌరవం, భూమి, భుక్తి, విముక్తి కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఉద్యమంలో దొడ్డి కొమురయ్య వీరోచిత పోరాటం చేశారని అన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న పరిస్థితులపై చైతన్యపరిచి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేశారని తెలిపారు. సామాజిక న్యాయం, సమానత్వం కోసం దొడ్డి కొమురయ్య చేసిన పోరాటం యువతకు మార్గదర్శకమని తెలిపారు. దేశ స్వాతంత్రం, ప్రజల సంక్షేమం కోసం విరోచితంగా పోరాడి, ప్రాణ త్యాగాలు చేసిన మహనీయుల చరిత్రను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ రాజేందర్ గౌడ్,ఎస్ . సి.కార్పొరేషన్ ఈ.డి.అబ్దుల్ ఖలీల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ర్యాగింగ్ నివారణపై అవగాహన సదస్సు ప్రభుత్వ చట్టాలపై విద్యార్థులకు అవగాహన

## చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుంది సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్

**నారాయణపేట ప్రతినిధి జులై 04 (ప్రజా జ్యోతి)**

తెలంగాణా రాష్ట్ర న్యాయ సేవా అధికార సంస్థ మరియు జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ కం జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఆదేశాల మేరకు నారాయణపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో “ర్యాగింగ్ నివారణ” అవగాహన కార్యక్రమం సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ అధ్యక్షతన న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించడం జరిగింది. సీనియర్ సివిల్ జడ్జి వింధ్య నాయక్ మాట్లాడుతూ ర్యాగింగ్ అనేది సరదా కాదు. ర్యాగింగ్ వల్ల ఒక విద్యార్థి మానసికంగా కుంగిపోతాడు. చదువు ఆగిపోతుంది. కాబట్టి ఎవరూ ర్యాగింగ్ చేయొద్దు, చేయించుకోవద్దు. ఒకవేళ మీకు ఎవరైనా ఇబ్బంది పెడితే భయపడకుండా వెంటనే కళాశాల యాజమాన్యానికి, తల్లిదండ్రులకు లేదా 100 నెంబర్ ద్వారా పోలీసులకు ఫిర్యాదు చేయండి. మీరు బాగా చదివి తల్లిదండ్రులకు, కళాశాలకు, మంచి పేరు తీసుకురావాలి. ఈ వయసు చాలా సున్నితమైనది. ఈ వయసులో చేసే చిన్న తప్పు కూడా మీ జీవితాన్ని మొత్తం మార్చేస్తుంది. అందుకే చెడు అలవాట్లకు, చెడు స్నేహాలకు దూరంగా ఉండాలి అని తెలిపారు. ప్రిన్సిపాల్ జూనియర్ సివిల్ జడ్జి సాయి మనోజ్ మాట్లాడుతూ చట్టాలను గౌరవించాలని, విద్యార్థులు డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని, పోక్సో చట్టం, రాజ్యాంగంలోని హక్కుల పట్ల అవగాహన కలిపించారు. అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి అవినాష్ మాట్లాడుతూ సోషల్ మీడియా వ్యసనం వద్దని, సమయాన్ని చదువుకు కేటాయించాలని తెలిపారు. చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్సె కౌన్సెల్ కే. లక్ష్మిపతి గౌడ్ న్యాయ సహాయం కోసం టోల్ ఫ్రీ నెం. 15100 గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ సుదర్శన్ రావు, రఘువీర్, దత్తాత్రేయ, క్రాంతి న్యాయవాదులు, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.




# చత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణకు సర్వం సిద్ధం

**గండిడ్, జూలై 4 (ప్రజా జ్యోతి):**

గండిడ్ మండలంలోని వెన్నచెడు గ్రామంలో జూలై 5న ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు విగ్రహ దాత, సేవా రత్న అవార్డు గ్రహీత డాక్టర్ వెన్న ఈశ్వరప్ప తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ ప్రజలు, యువత, అన్ని వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.




ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆదిత్య పరా శ్రీ స్వామి, గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్, చేవెళ్ల పార్లమెంట్ సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, పరిగి ఎమ్మెల్యే టి. రామ్మోహన్ రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ డి.కె. అరుణ, మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి, కరణం ప్రహ్లాద్ రావుతో పాటు వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, అన్ని కుల సంఘాల నాయకులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొననున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

వెన్నచెడు గ్రామ శివాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ విగ్రహ ఆవిష్కరణ మహోత్సవానికి పరిసర గ్రామాల ప్రజలు, యువకులు, మహిళలు అధిక సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని శివాజీ యువజన సంఘం సభ్యులు విజ్ఞప్తి చేశారు.

# రాష్ట్రపతి చేతుల మీదగా డిగ్రీ పట్టా అందుకున్న గోవర్ధనగిరి యువకుడు. మేకల రాకేష్

## ఆర్ఎంఐటీ కోర్సులో ద్వితీయ ర్యాంకు సాధించిన మేకల రాకేష్‌కు తెనుగోళ్ళ తాలుకా కమిటీ అభినందనలు

**వీపనగండ్ల ప్రజా జ్యోతి రిపోర్టర్**

మండలంలోని గోవర్ధనగిరి గ్రామానికి చెందిన మేకల రాకేష్‌కు కొల్లాపూర్ తెనుగోళ్ళ తాలుకా కమిటీ ఆధ్వర్యంలో శనివారం ఘన సన్మానం నిర్వహించారు. అనంతపురంలోని సెంట్రల్ యూనివర్సిటీలో రిటైల్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ (ఆర్ఎంఐటీ) కోర్సులో ద్వితీయ ర్యాంకు సాధించిన రాకేష్‌కు ఇటీవల భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్మ చేతుల మీదుగా డిగ్రీ పట్టా ప్రదానం కావడంతో గ్రామస్థులు, తెనుగోళ్ళ సంఘం ప్రతినిధులు ఆయనను ఘనంగా అభినందించారు. ఈ సందర్భంగా తెనుగోళ్ళ తాలుకా కమిటీ అధ్యక్షుడు గడ్డికోపుల శివప్రసాద్ మాట్లాడుతూ.. రాష్ట్రపతి చేతుల మీదుగా డిగ్రీ అందుకోవడం రాకేష్ వ్యక్తిగత విజయమే కాకుండా ఆయన కుటుంబానికి, గోవర్ధనగిరి గ్రామానికి, తెనుగోళ్ళ సమాజానికి గర్వకారణమని అన్నారు. కృషి, పట్టుదలతో చదివితే ఉన్నత విజయాలు సాధించవచ్చని రాకేష్ నిరూపించారని పేర్కొన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించి సమాజానికి, దేశానికి మరింత పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అనంతరం రాకేష్‌ను శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తాలుకా కమిటీ ఉపాధ్యక్షులు తెలుగు మధు, కొమ్ముల ఆంజనేయుడు, కార్యదర్శి పెబ్బేటి రేణయ్య, ప్రధాన కార్యదర్శి బొలమోని దర్గేష్, సహాయ కార్యదర్శి తాళ్ల మురళీమోహన్, చిన్నంబావి మండల అధ్యక్షుడు కంచి కర్ణాకర్, గోవర్ధనగిరి గ్రామ సహకార సంఘ కార్యదర్శి గుంటి మహేశ్వర్, డైరెక్టర్లు బొలమోని పెంటయ్య, మేకల ఆంజనేయులు, కొలగారి పడిగన్న, రమణమోని ఊషన్న, వార్డు సభ్యుడు బొలమోని వెంకటస్వామి, మాజీ సొసైటీ కార్యదర్శి సింగనమోని భగవంతు తదితరులు పాల్గొన్నారు.

